క్లుప్తంగా

అన్నదాత పోరుకు తరలిన నేతలు

పుంగనూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంగళవారం చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి పుంగనూరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నేతలు, రైతులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పలమనేరుకు తరలివెళ్లారు.

గర్భిణులు సలహాలు పాటించాలి



గర్భిణులకు పౌష్టికాహారం ఇస్తున్న డాక్టర్ శాలిని

బైరెడ్డిపల్లె: గర్భిణులు తప్పనిసరిగా వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని వైద్యాధికారులు శాలిని, అరుణ్‌కుమార్ అన్నారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తీర్థం, బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో మంగళవారం గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహతీ ఫౌండేషన్ నిర్వాహకులు అందించిన పౌష్టికాహారం పంపిణీ చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్లు సావిత్రమ్మ, కాంతమ్మ, మహతీ ఫౌండేషన్ నిర్వాహకులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సదుం: బాల్యవివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంకల్ప కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్యాడ్ గుడ్ టచ్ గురించి ఆమె వివరించారు. మహిళలకు అన్ని రంగాలలో విస్తృతంగా అవకాశాలు ఉన్నాయని, విద్యార్థినులు బాగా చదివి రాణించాలని హెచ్‌ఎం సుబ్రమణ్యం సూచించారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషిచేయాలి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలంలోని అన్ని పంచాయతీల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మునిరాజ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధిపై మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధి చెందినప్పుడే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కలిగి అభివృద్ధికి నోచుకుంటాయని తెలిపారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు.

శ్రీవారి సేవకుడికి సన్మానం



రవీంద్రను సన్మానిస్తున్న ఏఈఓ

పలమనేరు: పలమనేరు మండలం కాప్పల్లికి చెందిన శ్రీవారి సేవకుడు రవీంద్రను టీటీడీ అదనపు ఈఓ వెంకటేష్‌చౌదరి మంగళవారం తిరుమలలో ఘనంగా సన్మానించారు. ఆయన జిల్లా నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి సైతం టీటీడీ అన్నదానానికి వందలాది లోడ్ల కూరగాయలను దాతల ద్వారా సేకరించి ఆలయానికి పంపుతున్న విషయం తెలిసిందే. దీంతో ఆయన సేవలను కొనియాడారు. ఈనెల 24నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు సైతం కూరగాయలను పంపిణీ చేయాలని కోరినట్టు తెలిపారు.

యూరియా పంపిణీ పరిశీలన

రొంపిచెర్ల: వ్యవసాయ పంటల సాగు కోసం ప్రభుత్వం అందిస్తున్న యూరియాను రైతులు దుర్వినియోగం చేయొద్దని ఏఓ శ్రావణి అన్నారు. ఆమె మంగళవారం మండలంలో జరుగుతున్న యూరియా పంపిణీని పరిశీలించారు. రొంపిచెర్ల మండలానికి 51.66 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని బండకింద పల్లె, బొమ్మయ్యగారిపల్లె, రొంపిచెర్ల, గానుగచింత, పెద్దమల్లెల గ్రామ రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ చేస్తారన్నారు. సోమవారం 550 బస్తాలు, మంగళవారం 345 బస్తాలు పంపిణీ చేశామని తెలిపారు. ఇంకా 210 బస్తాల యూరియా ఉందన్నారు.

ఆగని బస్సులు



బస్టాండుకు దూరంగా ఆపిన బస్సు

సదుం: మండల కేంద్రంలోని బస్టాండులో కొన్ని బస్సులను ఆపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు బస్సు డ్రైవర్లు బస్టాండుకు దూరంగా రహదారిపైనే బస్సులను నిలుపుతున్నారు. బస్సుల కోసం బస్టాండులో వేచి ఉన్న ప్రయాణికులు రహదారిపైకి పరుగులు పెట్టాల్సి వస్తోంది. మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తుండడంతో కొంతమంది సిబ్బంది మహిళల పట్ల చులకనగా, నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అన్నదాత పోరు విజయవంతం

- యూరియా కోసం రైతన్నల నిరసన
- రైతులను అడ్డుకున్న పోలీసులు
- రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్న వెంకటేగౌడ



ర్యాలీలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెంకటేగౌడ



రైతన్నలకు అండగా నిరసనలో మహిళా నేతలు



ఆర్డీఓ కార్యాలయంలోకి వెళుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెంకటేగౌడ

పలమనేరు: సాగు చేసిన పంటలకు కనీసం యూరియా అందించని దయనీయమైన కూటమి పాలనపై రైతులు చేపట్టిన అన్నదాత పోరు విజయవంతమైంది. ఆమేరకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పలమనేరులో మంగళవారం జరిగిన బ్లాక్‌మార్కెట్‌కు తరలిన యూరియాపై అన్నదాత పోరు కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సిల్క్‌ఫాం నుంచి మూడు వేలమందికి పైగా రైతులు నిరసన ర్యాలీ చేస్తూ ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. నిరసనకు రైతులు రాకుండా చేసేందుకు స్థానిక పోలీసులు సోమవారం రాత్రి అప్పటికప్పుడు 30 పోలీస్‌యాక్టును అమలు చేశారు. మరోవైపు పట్టణ నలువైపుల నుంచి రైతులు రాకుండా బారికేడ్లను ఏర్పాటు చేసి పోలీసుల పహారా నిర్వహించి రైతులు రాకుండా అడ్డుకున్నారు. కానీ కడుపుమండిన రైతులు పలు మార్గాల ద్వారా ఇక్కడి ఆర్డీఓ కార్యాలయానికి వేలసంఖ్యలో చేరుకున్నారు. దీన్ని గమనించిన పోలీసులు సైతం కాస్త వెనక్కితగ్గారు. రైతులకు అన్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వ పాలన నశించాలంటూ రైతులు నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ చేశారు. ఆర్డీఓ కార్యాలయం వద్దకు వెళ్లగానే అక్కడున్న పోలీసులు రైతులు లోనికెళ్లకుండా అడ్డుకున్నారు. కనీసం మీడియాను సైతం వదలమని భీష్మించారు. అయితే పెద్దిరెడ్డి రాకతో ముఖ్యనాయకులు, మీడియాను లోనికి అనుమతినిచ్చారు. రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ ఓ వినతిపత్రాన్ని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆర్డీఓ భవానికి అందజేశారు.

రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది

వెంకటేగౌడ మాట్లాడుతూ గతంలో వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులకు కావాల్సిన ఎరువులు, మందులు, సలహాలు, సూచనలు ఆర్‌బీకేల ద్వారా గ్రామాల్లోనే అందేవన్నారు. నేటి కూటమి పాలనలో రైతులపై కక్షగట్టి కనీసం పంటకు యూరియా కూడా లేకుండా చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. నిన్నటిదాకా అందుబాటులోని యూరియా ఇప్పుడు కొంతైనా ఆర్‌ఎస్‌కేల్లో రైతులకు ఇస్తున్నారంటే అది కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునకు భయపడేనన్నారు. రైతులకు కావాల్సిన యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలించి ఇక్కడి రైతులకు అన్యాయం చేసిన ఘనత కూటమి సర్కార్‌కే దక్కిందన్నారు. వచ్చిన యూరియా సైతం పచ్చనేతలకు ముందుగా ఇస్తున్నారని ఆరోపించారు. నిజంగా ఎరువులు కావాల్సిన రైతులకు మొండిచేయి తప్పడంలేదన్నారు. అనంతరం చిత్తూరు పార్లమెంటు పరిశీలకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు యూరియా ఇవ్వకుండా దాన్ని ఎక్కువగా వేస్తే పొలాలు పాడవుతాయని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలని కూటమి సర్కార్‌ను కోరారు.

పార్టీ శ్రేణుల్లో జోష్ నింపిన పోరు

యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ చేసిన అన్నదాత పోరుబాట విజయవంతమైంది. దీంతో పార్టీ శ్రేణుల్లోనూ జోష్ వచ్చింది. కేవలం పదిమంది మాత్రమే రావాలని పోలీసులు ముందుగానే సూచించారు. కానీ ఈ నిరసనకు అనూహ్యంగా మూడు వేలమందికిపైగా రావడంపై పోలీసులు, నిఘా అధికారులు సైతం ఆశ్చర్యపోయారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్లు హేమంత్‌కుమార్‌రెడ్డి, బాలాజీ నాయుడు, కేశవులు, యువరాజ్, భాస్కర్‌రెడ్డి, బాగారెడ్డి, భారీ సంఖ్యలో పార్టీనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులపై కేసుల కోసం ప్రత్యేక నిఘా

కార్యక్రమానికి వచ్చిన రైతులపై ఎలాగైనా కేసులు పెట్టాలని పోలీసులు భారీ హంగామా చేశారు. ఫాల్కన్ వాహనం ద్వారా నలువైపులా కెమెరాలను పెట్టి వీడియో రికార్డింగ్ చేశారు. రైతులు రాకుండా పట్టణ నలువైపులా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక్కడికి వచ్చిన రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులపై నిబంధనలు ఉల్లంఘించారంటూ కేసులు పెట్టేందుకు ఇప్పటికే పోలీసులు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది.



రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

యూరియా ఏమైందో...



వరి పంటకు ప్రస్తుతం యూరియా అవసరం ఉంది. దీంతోపాటు పశుగ్రాసం, మల్బరీ, మామిడి తోటలకు ఎరువులు వేయాలి. కానీ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎందుకు యూరియాకు ఇప్పుడు డిమాండ్ వచ్చిందో అర్థం కావడం లేదు. ప్రభుత్వం స్పందించాలి.

–సురేంద్ర, పెనుగొలకల, పెద్దపంజాణి మండలం

రైతులేమైనా బంగారం అడిగారా..



తాము సాగుచేసిన పంటలకు మా డబ్బుతో యూరియా కొనుక్కుంటామని వెళ్లినా యూరియా లేదు. దీంతో వేలకు వేలు పెట్టి పంట సాగు చేసిన రైతుకు ఎరువులు లేకుంటే ఎలా పంటపండించేది. ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యం చేస్తే ఎలా, ఇలాంటి పరిస్థితి గత వైఎస్సార్‌సీపీ పాలనలో లేదు.

–దేవసేన, నిడిగుంట, పెద్దపంజాణి మండలం

రైతులంటే పట్టదా..



చంద్రబాబు సీఎంగా గెలిచిన ప్రతిసారీ రైతులకు కష్టాలు తప్పడంలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇటువంటి పరిస్థితి లేదు. ఈప్రభుత్వం యూరియా వేస్తే పంట భూములు నాశనమవుతాయంటూ రైతులను మభ్యపెడుతోంది.

–ఉష, ముత్తుకూరు, పెద్దపంజాణి మండలం

యూరియా ఇప్పుడెలా వచ్చింది..



మొన్నటిదాకా అందుబాటులో లేని యూరియా ఇప్పుడెలా వచ్చింది. కేవలం జగన్‌మోహన్‌రెడ్డి రైతన్నల సమస్యపై మాట్లాడితే వెంటనే కూటమి ప్రభుత్వం స్పందిస్తుందేగానీ లేకుంటే లేదు. అసలు రైతులపై ఈ ప్రభుత్వానికి ఎందుకింత కక్ష.

–కిశోర్‌కుమార్, ముసలిమొడుగు, పలమనేరు మండలం

పంట పండాలంటే యూరియా కావాలి



ప్రస్తుతం వరి పంటకు, మల్బరీ పంటకు, పశుగ్రాసానికి, మామిడి రైతులకు ఈ సీజన్‌లో యూరియా అవసరం ఉంది. గతంలో ఇలాంటి డిమాండ్ ఎప్పుడూ లేదు. దీంతో ఇక్కడి రైతులు పక్కనే ఉన్న కర్ణాటకలో యూరియా తెచ్చుకున్నారు. ఇక్కడ అరకొరగా వచ్చిన యూరియా అధికార పార్టీ వారికే చాలడం లేదు.

–మల్లీశ్వర్‌రెడ్డి, కాబ్బల్లి, పలమనేరు మండలం

సమస్యను పట్టించుకోండి!



వీరప్పనాయునిచెరువులో కలుస్తున్న వ్యర్థపు నీరు

కుప్పంరూరల్: కుప్పం మండలం, వీరప్పనాయుని చెరువులో పక్కన ఉన్న పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలతో నీరు కలుషితమవుతోందని అధికారులు పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల విడుదలైన నీరు వీరప్పనాయునిచెరువుకు చేరుతోంది. ఈక్రమంలో పక్కనే ఉన్న పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలు ఈ చెరువులోకి పెద్ద ఎత్తున చేరుతుండడంతో చెరువు నీరు కలుషితమవుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కలుషిత నీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యూరియా కొరతను తీర్చండి

- కుప్పం ఆర్డీఓకు ఎమ్మెల్సీ భరత్ వినతి

శాంతిపురం: వ్యవసాయం కుంటుపడకుండా యూరియా కొరతను తీర్చాలని ఎమ్మెల్సీ, కుప్పం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కేఆర్‌జే భరత్ కోరారు. పార్టీ పిలుపు మేరకు అన్నదాత పోరుబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన పార్టీ నేతలతో కలిసి ఆర్డీఓ శ్రీనివాసరాజుకు వినతిపత్రం అందించారు. కుప్పం మండల పార్టీ కన్వీనర్ మురుగేష్ మాట్లాడుతూ కొందరు ప్రైవేటు వ్యాపారులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. కాంప్లెక్స్ కొంటేనే యూరియా ఇస్తామని నిబంధనలు పెడుతున్నారని శాంతిపురం మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి ఆర్డీఓకు తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో గతంలోలా ఎరువులు పంపిణీ చేయాలని రామకుప్పం మండల పార్టీ కన్వీనర్ బాబురెడ్డి, ఒక్కో ఆధార్ కార్డుపై కనీసం 3 బస్తాల యూరియా ఇవ్వాలని జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి కోరారు. 30 పోలీస్ యాక్టును విపక్షానికి మాత్రమే అమలు చేస్తున్నారని జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ యూరియా కొరత రాకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. అంతకు ముందు ఆర్డీఓ కార్యాలయం వద్దకు వచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులను రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, రాళ్లబూదుగూరు, రామకుప్పం ఎస్‌ఐలు నరేష్, వెంకటమోహన్, పోలీసులు అడ్డుకున్నారు. ఎమ్మెల్సీతో పాటు 15 మందిని వినతి పత్రం ఇచ్చేందుకు అనుమతించారు. రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, కౌన్సిలర్లు మునిరాజు, మణి, విజయకుమార్, నాగరాజు, నేతలు చెంగప్ప, వనిత, నాగభూషణం, సుబ్రమణ్యం, ఆదెమ్మ, విజయకుమార్, మంజునాథరెడ్డి పాల్గొన్నారు.

వేళకు రాని బస్సు

- పాఠశాలకు నిత్యం ఆలస్యం
- ఆర్టీసీ అధికారులు స్పందించాలంటున్న విద్యార్థులు



బస్సు రాకపోవడంతో వేచి ఉన్న విద్యార్థులు

కుప్పంరూరల్: వేళకు రాని బస్సుతో నిత్యం పాఠశాలలకు ఆలస్యంగా వెళ్తున్నామని విద్యార్థులు ఆవేదన చెందుతున్న వైనం కుప్పం మండలం, చీగలపల్లి, నారాయణపురం గ్రామాల్లో చోటుచేసుకుంటోంది. మూడేళ్ల క్రితం కుప్పం నుంచి సామగుట్టపల్లి, యలాజనూరు, చీగలపల్లి మీదుగా నారాయణపురానికి ఉదయం, సాయంత్రం బస్సు సర్వీసును వేశారు. కొంత కాలంగా బాగా నడిచిన బస్సు ఈ మధ్య కాలంలో ఉదయం 8 గంటలకు రావాల్సిన బస్సు 9 గంటలైనా రాకపోవడంతో నిత్యం విద్యార్థులు సకాలంలో పాఠశాలలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. సామగట్టపల్లి, యలాజనూరు, పెద్దన్నకొటాలు, చీగలపల్లి, నారాయణపురం గ్రామాల నుంచి నిత్యం 80 మంది విద్యార్థులు కుప్పం పట్టణానికి వివిధ పాఠశాలలకు వెళుతుంటారు. ఉదయం 8 గంటలకు రావాల్సిన బస్సు 9 గంటలకు వస్తోంది. ఆర్టీసీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలల సమయానికి ఉదయం, సాయంత్రం బస్సు నడపాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

12న సర్వసభ్య సమావేశం

కుప్పం: ఈనెల 12న కుప్పం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయ్‌పత్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు, మండల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

సర్కార్ ఆస్పత్రుల్లోనే కాన్పులు సురక్షితం

రొంపిచెర్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే గర్భిణులు కాన్పులు చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ అన్నారు. ఆయన మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకంలో గర్భిణులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు చేసుకోవడం వల్ల తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని తెలిపారు. ప్రైవేటు డాక్టర్లు సాధారణ కాన్పులకు కూడా ఆపరేషన్లు చేసి డబ్బులు దోచుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పైసా ఖర్చు లేకుండా కాన్పు చేసుకోవచ్చన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు చేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం కూడా అందిస్తుందన్నారు. గర్భిణులకు ఆరోగ్య, ల్యాబ్ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అమ్మణ్ణ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న వెంకటేగౌడ

వి.కోట: మండలంలోని తోటకనుమ గ్రామానికి చెందిన జయపాల్‌రెడ్డి మంగళవారం మృతిచెందారు. విషయం తెలిసి మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తోటకనుమ చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మండలంలోని ఓగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత అమరేష్ నానమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. విషయం తెలిసి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తనయుడు అమరనాథ్ ఓగు గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు.

చావు కష్టాలు

- దళితుల శ్మశాన భూమి ఆక్రమణ



అవస్థలతో మృతదేహాన్ని మోసుకెళుతున్న దృశ్యం

వి.కోట: దశాబ్దాలుగా దళితుల శ్మశానానికి దారి లేక అగచాట్లు పడుతున్నామని మృతదేహంతో ముళ్లకంపలను, చెట్లను తొలగించుకుంటూ శ్మశానానికి వెళుతుంటామని మండల దళిత నేతలు వాపోయారు. గ్రామ పంచాయతీ ఓగులో 35 మాదిగ కుటుంబాలు నివసిస్తున్నాయి. దశాబ్దాలుగా ఇక్కడ జీవనం కొనసాగిస్తున్న వారికి గతంలో ప్రభుత్వం కొంత భూమిని శ్మశానానికి కేటాయించింది. ప్రస్తుతం ఆ భూమి ఆక్రమణకు గురైంది. దీంతో ఆ గ్రామస్తులకు దారి సౌకర్యం లేక నానా అగచాట్లు పడి శ్మశానానికి పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ విషయంపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం దళిత కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. శ్మశానానికి తీసుకెళ్లడానికి దారి లేకపోవడంతో ముళ్లకంపలను, చెట్లను తొలగించుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని నేతలు వెంకటేష్, రాము, రాజేంద్ర డిమాండ్ చేశారు.

అన్నదాతను ఆదుకోవడంలో కూటమి విఫలం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చౌడేపల్లె: అన్నదాతకు అవసరమైన విత్తనకాయలు, ఎరువులను సకాలంలో సమకూర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగభూషణరెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ ఆరోపించారు. మంగళవారం పలమనేరు ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే అన్నదాత పోరుకు పార్టీ నేతలతో కలిసి వారు బయలుదేరుతూ మీడియాతో మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కడం బాధాకరమన్నారు. వరి విస్తారంగా సాగుచేశారని, అవసరానికి సరిపడా యూరియా రైతులకు సమకూర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సరిపడా ఎరువులను సకాలంలో అందుబాటులో అందించారన్నారు. విత్తనాల కాయలతో పాటు రైతులకు ఆర్థిక చేయూతనిచ్చారన్నారు. గంటల తరబడి క్యూలో నిరీక్షించినప్పటికీ రైతులకు యూరియా అందక ఆందోళనతో వెనుదిరిగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రమేష్‌బాబు, కోఆప్షన్‌మెంబర్ సాదిక్ బాషా, సర్పంచ్ షంషీర్, గిరిబాబు, బాబు, చలపతినాయుడు, బాలాజి, మునికృష్ణనాయుడు, నరసింహారెడ్డి, నరేష్, గణేష్, గంగాధర్, గంగిరెడ్డి, రాజారెడ్డి, అనుప్రియ, లావణ్య ఉన్నారు.